క్లుప్తంగా

'నీతోడు ట్రాన్స్‌జెండర్ సొసైటీ'కి రూ.లక్ష విరాళం



విరాళం అందజేస్తున్న ఆర్‌సీఎం స్కూల్ సిబ్బంది

బొండపల్లి: విశాఖపట్నంలోని నీతోడు ట్రాన్స్ జెండర్ సొసైటీకి లక్ష రూపాయిలను బొడసింగిపేట గ్రామంలోని ఆర్‌సీఎం స్కూల్ విద్యార్థులు తమ వంతు సాయంగా అందజేశారు. ఇటీవల పాఠశాలలో నిర్వహించిన సైన్స్ ఎగ్జిబిషన్‌తో పాటు ఫుడ్ ఫెస్ట్‌కు వచ్చిన నగదును ప్రిన్సిపాల్ శాంతి సిస్టర్ ఆధ్వర్యంలో అందజేశారు. ఆర్‌సీఎం చిన్నారులను పలువురు అభినందించారు.

పౌష్టికాహారంతోనే గర్భిణులకు ఆరోగ్యం

దత్తిరాజేరు: గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవడం ద్వారానే ఆరోగ్యంగా ఉంటారని కె.కొత్తవలస ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి స్రవంతి అన్నారు. శుక్రవారం 35 మంది గర్భిణులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పాలు, గుడ్లు, క్యారట్, బీట్‌రూట్, ఆకుకూరలు, కూరగాయలు వంటి పౌష్టికాహారం తినడం వల్ల కాల్షియం శరీరంలో ఎక్కువగా ఉండడం వల్ల ఆరోగ్యంగా ఉంటారన్నారు.

సీతారామపురంలో వైద్య శిబిరం



రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారిణి సుష్మా

గజపతినగరం : మండలంలోని సీతారామపురం గ్రామ సచివాలయంలో శుక్రవారం నిర్వహించిన 104 వైద్య శిబిరంలో 56 మందిని మరుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారిణి సుష్మా పరీక్షించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా రోగులకు ఆరోగ్య సంబంధమైన పలు సూచనలు చేశారు.

బీమాతో ప్రయోజనం



బీమా చెక్కును అందజేస్తున్న బీఎం రజినికుమార్

గుర్ల: ప్రతి ఒక్కరికి బ్యాంకు ఖాతాతో పాటు బీమా ఉండడంతో ప్రయోజనం చేకురుతుందని ఏపీజీవీబీ గరివిడి శాఖ మేనేజర్ వై.రజినికుమార్ అన్నారు. మండలంలోని పెద్దబంటుపల్లికి చెందిన కరిమజ్జి రాము ఇటీవల ప్రమాదవశాత్తు మృతి చెందాడు. మృతి చెందిన వ్యక్తికి బీమా ఉండడంతో బ్యాంకు మేనేజర్ రజినికుమార్ రూ.10లక్షల చెక్కును శుక్రవారం అందజేశారు. గ్రామాల్లో ఉన్న ప్రతి ఒక్కరు ఖాతాను తెరుచుకోవాలని సూచించారు. ఏపీజీవీబీ సేవలను వినియోగించికోవాలని కోరారు. చెక్కును అందించిన వారిలో సర్పంచ్ కంకణాల శ్రీనివాసరావు, బ్యాంకు సిబ్బంది ఉన్నారు.

సంతాపం



సూరిదేముడు

వేపాడ: మండలంలోని బానాది ఎంపీటీసీ మాజీ సభ్యుడు కలిగొట్ల సూరిదేముడు కొన్నాళ్లుగా అనారోగ్యంతో బాధపడుతూ విశాఖలోని కేజీహెచ్‌లో గురువారం రాత్రి మృతి చెందాడు. ఈయన మృతి పట్ల పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఉప సర్పంచ్ తదితరులు తమ సంతాపం తెలిపారు. ఆయన కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు.

చంద్రంపేటలో కంపు కొడుతున్న కాలువలు

గంట్యాడ: మండలంలోని చంద్రంపేట గ్రామంలో మురుగు కాలువలు కంపు కొడుతున్నాయి. కాలువలు దెబ్బతినడంతో మురుగు నీరు ఎక్కడికక్కడ నిలిచిపోతుంది. దీంతో కంపు కొడుతూ దోమలు స్వైర్య విహారం చేస్తున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్ల పైనుంచి కూడా మురుగు ప్రవహిస్తుండడంతో ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. అధికారులు తక్షణమే స్పందించి కాలువలను పరిశుభ్రం చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

వేంకటేశ్వరస్వామి సేవలో మాజీ ఎమ్మెల్యే

దత్తిరాజేరు(జామి): జామి మండలంలోని అన్నంరాజపేట గ్రామంలో ఉన్న వేంకటేశ్వరస్వామిని ముక్కోటి ఏకాదశి సందర్భంగా గజపతినగరం మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య దంపతులు దర్శించుకున్నారు. శుక్రవారం ఉదయం ఆలయానికి వచ్చిన మాజీ ఎమ్మెల్యేకు ఆలయ అర్చకులు స్వాగతం పలికి పూజా కార్యక్రమాలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆయన వెంట జామి మండలానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు ఉన్నారు.

వైభవంగా ముక్కోటి ఏకాదశి



కొత్తవలస : గరుడాద్రి వేంకటేశ్వరస్వామికి 2.5 కిలోల వెండి కిరీటాన్ని సమర్పించుకుంటున్న శ్రీనివాసరావు దంపతులు

ముక్కోటి ఏకాదశిని భక్తులు వైభవంగా శుక్రవారం జరుపుకున్నారు. కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పూజలు, వ్రతాల్లో పాల్గొన్నారు. – సాక్షి నెట్‌వర్క్



లక్కవరపుకోట :ఎల్.కోట రామాలయంలో సీతారామచంద్రస్వామివారికి క్షీరాభిషేకం నిర్వహిస్తున్న పురోహితుడు



వేపాడ: విశేషాలంకరణలో కల్యాణ వేంకటేశ్వరస్వామి



వేపాడ: స్నపన తిరుమంజనంలో పసుపు, తులసీ మాలాధారణలో స్వామి దర్శనం



బొండపల్లి: కొండవానిపాలెంలోని కల్యాణ వేంటేశ్వర ఆలయం వద్ద పూజలు



దత్తిరాజేరు: ముక్కోటి ఏకాదశి సందర్భంగా వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజల్లో పాల్గొన్న భక్తులు



ఎస్.కోట: భర్తాపురం కోవెలలో శ్రీవారిని దర్శించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు



గజపతినగరం: సీతారామ ఆలయంలో వేంకటేశ్వర స్వామికి పూల అలంకరణ



మెరకముడిదాం: భైరీపురంలోని శ్రీవేంకటేశ్వర ఆలయ ప్రాంగణంలో కోలాటం ఆడుతున్న చిన్నారులు, మహిళలు

కిశోరి బాలికలు ఉన్నత విద్యనభ్యసించాలి



కిశోరి బాలికలు ఉన్నత విద్యనభ్యసించి 18 సంవత్సరాలు దాటిన తరువాతే వివాహం చేసుకోవాలని ఎంఈఓ సీహెచ్ కూర్మారావు సూచించారు. లక్కవరపుకోట ఎంపీడీఓ కార్యాలయంలో వియ్యంపేట ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో సహాయ సీడీపీఓ బి.లక్ష్మీభాయి ఆధ్వర్యంలో కిశోరి బాలికా వికాసం కార్యక్రమంపై మండల స్థాయి అధికారులు, మహిళా పోలీసులు, రెవెన్యూ, పంచాయతీ కార్యదర్శులకు శుక్రవారం శిక్షణ నిర్వహించారు. కిశోరి బాలికలకు వివాహం చేయడం వల్ల జరిగే అనర్థాలను వివరించారు. ఈ సందర్భంగా దీనికి సంబంధించి వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. డీటీ టి.రమేష్, పీహెచ్‌సీ వైద్యుడు అనిల్‌కుమార్, ఎంఈఓ 2 శ్రీనివాసరావు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు పి.భాగ్యలక్ష్మి, వి.రామకృష్ణమ్మ తదితరులు పాల్గొన్నారు. – లక్కవరపుకోట

'తోటపల్లి'లో పూడికతీతకు రూ.6కోట్లు

గుర్ల: తోటపల్లి కాలువ పూడికల తీతకు రూ.6కోట్లు ఖర్చు చేసి వచ్చే ఖరీఫ్ నాటికి మండలంలోని శివారు ఎకరాకు నీరు అందిస్తామని ఎమ్మెల్యే కిమిడి కళా వెంకటరావు అన్నారు. మండలంలోని అచ్యుతపురంలో నిర్మించిన మినీ గోకులం షెడ్లను ఆయన శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోకులం షెడ్లను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఉపాధి నిధులతో గ్రామాల్లో జోరుగా సీసీ రోడ్లు వేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శేషుబాబు, తహసీల్దార్ ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



గోకులం షెడ్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కళా వెంకటరావు

టీబీ రాకుండా ముందస్తు చర్యలు

చీపురుపల్లి: టీబీ వ్యాధి రాకుండా ముందు జాగ్రత్త చర్యలు పాటించాలని క్షయ నిర్మూలన సంస్థ సూపర్‌వైజర్ జి.లలిత సూచించారు. జాతీయ క్షయ నిర్మూలన కార్యక్రమంలో భాగంగా క్షయ వ్యాధి నిర్మూలన కోసం నిర్వహిస్తున్న 100 రోజుల అవగాహన కార్యక్రమంలో భాగంగా శుక్రవారం చీపురుపల్లి మేజర్ పంచాయతీ పరిధిలోని రెడ్డిపేట, కొత్తఅగ్రహారం తదితర ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ టీబీ వ్యాధి సోకకుండా ఉండేందుకు ఎలాంటి జాగ్రత్తలు పాటించాలో ఈ వంద రోజులు కార్యక్రమంలో అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. ముందు జాగ్రత్తలు పాటించడం ద్వారా టీబీ వ్యాధి నుంచి ప్రతీ ఒక్కరూ దూరంగా ఉండొచ్చునని చెప్పారు. ప్రధానంగా బీపీ, సుగర్ వ్యాధిగ్రస్తులు తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలన్నారు. వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఇచ్చే సూచనలు తప్పనిసరిగా పాటించాలన్నారు.



కొత్తఅగ్రహారంలో అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ లలిత

కక్ష సాధింపు చర్యలు తగవు

బొండపల్లి: ప్రభుత్వ భూముల ఆక్రమణల విషయంలో రెవెన్యూ అధికారులు నిబంధనలను పక్కాగా అమలు చేయాలని, కూటమి నేతలకు అనుకూలంగా పని చేస్తే సరికాదని ఎంపీపీ చల్లా చలంనాయుడ పేర్కొన్నారు. మండలంలోని గొల్లలపేట గ్రామంలో పీతల చంటిబాబుకు చెందిన రేకుల షెడ్డును రెవెన్యూ అధికారులు గురువారం కూలగొట్టగా బాధిత కుటుంబ సభ్యులను ఆయన శుక్రవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. 13 సంవత్సరాలుగా రేకుల షెడ్డును వేసుకొని జీవనం సాగిస్తున్న చంటిబాబు కేవలం వలంటీరుగా విధులు నిర్వర్తించడం వల్లే రాజకీయ కక్షతో సెంటున్నర స్థలంలో వేసిన షెడ్డును తొలగించారని ఆరోపించారు. రెవెన్యూ అధికారులు చెబుతున్నట్టు అదే ప్రభుత్వ సర్వే నంబరులో మిగతా ప్రభుత్వ భూమిని ఎందుకు తొలగించలేదని ప్రశ్నించారు. మండలంలో చాలా చోట్ల జాతీయ రహదారితో పాటు ఆర్‌అండ్‌బీ రోడ్లకు ఇరువైపులా చాలా ఆక్రమణలు ఉన్నాయని వాటిని తొలగించకుండా రాజకీయ కక్షతో వ్యవహరించారని దుయ్యబట్టారు. ఆయన వెంట బొండపల్లి, ముద్దూరు గ్రామల సర్పంచ్‌లు బొండపల్లి ఈశ్వరరావు, మునకాల పైడపునాయుడు, ఉప సర్పంచ్ కోళ్ల వెంకటరమణ, ఎంపీటీసీ బండారు శ్రీనివాసరావు, బాధిత కుటుంబ సభ్యులు ఉన్నారు.



బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎంపీపీ చల్లా చలంనాయుడు

యువత క్రీడల్లో రాణించాలి

• డీఎస్పీ రాఘవులు

మెరకముడిదాం: యువత క్రీడల్లో రాణించాలని, అప్పుడే దేశంలో మరింత మంది క్రీడాకారులు తయారవుతారని చీపురుపల్లి డీఎస్పీ ఎస్.రాఘవులు అన్నారు. మండలంలోని సోమలింగాపురంలో గ్రామానికి చెందిన లుక్ఫర్ ఫ్యూచర్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్రాంతి సంబరాలు సందర్భంగా సోమలింగాపురానికి చెందిన యువకులు నిర్వహిస్తున్న జిల్లా స్థాయి వాలీబాల్ పోటీల్లో పాల్గొంటున్న క్రీడాకారులందరినీ ఆయన అభినందించారు. ఈ పోటీల్లో మొత్తం 30 టీమ్‌లు పాల్గొంటున్నాయని, గ్రామీణ ప్రాంతంలో జిల్లాస్థాయి పోటీలను నిర్వహించడం అభినందనీయమని అన్నారు. అలాగే ఈపోటీల్లో గెలుపొందిన టీమ్‌లకు 30 వేలు క్యాష్ ప్రైజ్‌ను కూడా నిర్వాహకులు అందజేయనున్నారని ఆయన తెలిపారు. యువత డ్రగ్స్, మత్తు పదార్థాల జోలికి వెళ్లకుండా జాగ్రత్త పడాలని తల్లిదండ్రులకు సూచించారు. గ్రామాల్లో కోడిపందెలు లాంటివి నిర్వహించడం నిషేధమని నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బుధరాయవలస ఎస్‌ఐ జి.లోకేష్ కుమార్, సోమలింగాపురం ఎంపీటీసీ ఎస్.సీతారామరాజు, తదితరులు పాల్గొన్నారు.



వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న డీఎస్పీ రాఘవులు

జంగిల్ క్లియరెన్స్‌కు రూ.1.30లక్షలు

వేపాడ: మండలంలోని సోంపురం నుంచి జాకేరు, దబ్బిరాజుపేట రహదారిలో చెట్లు కొమ్మలు, జంగిల్స్ క్లియరెన్స్‌కు ఆర్‌అండ్‌బీ శాఖ రూ.1.30లక్షలు మంజూరు చేసినట్లు ఆర్అండ్‌బీ జె.ఈ వీరభద్రస్వామి తెలిపారు. ఆ రోడ్డును శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాకేరు, కరకవలస, చామలాపల్లి, దబ్బిరాజుపేట, మీదుగా వేపాడ, బక్కునాయుడుపేట ఆదర్శ పాఠశాలకు బడి బస్సు వేసేందుకు చెట్లు కొమ్ములు తొలగించాలని డిపో మేనేజరు చెప్పటంతో సామాజిక కార్యకర్త అప్పారావు కలెక్టరుకు అర్జీ పెట్టారు.. దీనిపై కలెక్టరు స్పందించి చెట్టుకొమ్ములు తొలగించి బస్సు నడిపేందుకు వీలు కలిగేలా పనులు చేపట్టాలని ఆదేశించడంతో ఈ మేరకు చర్యలు చేపట్టారు.



జాకేరు రోడ్డును పరిశీలిస్తున్న ఆర్అండ్‌బీ జేఈ వీరభద్రస్వామి

అందరి సహకారంతో బాల్య వివాహాలకు అడ్డుకట్ట



కిశోరి వికాసం వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న అధికారులు

వేపాడ: అందరి సహకారంతోనే బాల్య వివాహాలను అడ్డుకోవచ్చని ఎంపీడీఓ సూర్యనారాయణ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఐసీడీఎస్ సీడీపీఓ ఆర్.ఉమాదేవి ఆధ్వర్యంలో కిశోరి బాలికా వికాసం కార్యక్రమంలో ఆయన శుక్రవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలికలు శారీరకంగా, మానసికంగా, సామాజికంగా ఎదగాలన్నారు. బాల్య వివాహాలు చేయడం వల్ల కలిగే నష్టాలను వివరించారు. ఎస్‌ఐ దేవి, ఎంఈఓ జగదీశ్వరరావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు కామేశ్వరి, భాగ్యవతి, కె.స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.

ఊరూ.. వాడ.. సంక్రాంతి సందడి

ఊరూ.. వాడ.. సంక్రాంతి సందడి వచ్చేసింది. శుక్రవారం నుంచి పాఠశాలలకు సెలవులు ప్రకటించడంతో పల్లెలు, పట్టణాల్లో సందడి వాతావరణం నెలకొంది. పలుచోట్ల భోగి మంటలు ముందస్తుగానే వేశారు. హరిదాసులు, గంగిరెద్దులు సందడి చేస్తున్నాయి. రంగవల్లుల పోటీలతో బాలికలు, మహిళలు సందడి చేస్తున్నారు. సాంప్రదాయ దుస్తులు ధరించి సంక్రాంతి వేడుకల్లో పిల్లలు, పెద్దలు పాల్గొంటున్నారు. – సాక్షి నెట్‌వర్క్



ఎస్.కోట : చిన్నారులకు భోగిపళ్లు పోస్తున్న పెద్దలు



ఎస్.కోట: భోగి మంట వద్ద కోలాటం ఆడుతున్న విద్యార్థినులు



కొత్తవలస: విశేషంగా ఆకట్టుకున్న హరిదాసుల వేషధారణలో విద్యార్థులు



చీపురుపల్లి రూరల్ (గరివిడి): అవంతి ఇంజినీరింగ్ కళాశాలలో సంక్రాంతి సంబరాలు



బొండపల్లి: ఆకట్టుకున్న విద్యార్థుల సాంప్రదాయ వేషాధారణలు



చీపురుపల్లి: జీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సంక్రాంతి సంబరాలు



మెరకముడిదాం: చిన్నారి సోదమ్మతో సోది చెప్పించుకుంటున్న ప్రముఖ యూ ట్యూబ్ చానల్ యజమాని బ్యాంకాక్ పిల్ల



గజపతినగరం: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో భోగి మంటలు

కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించాలి..

• డీఎంహెచ్‌ఓ జీవనరాణి



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ జీవనరాణి

విజయనగరం ఫోర్ట్: సర్వే ద్వారా కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించాలని డీఎంహెచ్‌ఓ జీవనరాణి తెలిపారు. శుక్రవారం స్థానిక జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయంలో కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించే కార్యక్రమంపై పీహెచ్‌సీ వైద్యులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ.. వ్యాధిగ్రస్తులను త్వరగా గుర్తించి చికిత్స అందించగలిగితే అంగవైకల్యం బారిన పడకుండా కాపాడవచ్చన్నారు. సమావేశంలో డీఎల్‌ఓ కె. రాణి, ఎన్‌సీడీపీఓ సుబ్రహ్మణ్యం, డీఎంఓ మణి, డాక్టర్ అర్చన, తదితరులు పాల్గొన్నారు.